తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను శనివారం ఎర్రవల్లిలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తన పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

ఉపాధి పనుల్లో కుమ్రంభీం మనుమడు

- వీరి కుటుంబాన్ని ఆదుకున్న కేసీఆర్ సర్కార్
- ప్రస్తుతం పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- ఆర్థిక ఇబ్బందులతో సతమతం

కుమ్రంభీం ఆసిఫాబాద్ ఏప్రిల్ 19: (నమస్తే తెలంగాణ) : 'జల్.. జంగిల్.. జమీన్' కోసం పోరాడి వీరమరణం పొందిన కుమ్రంభీం మనుమడు సోనేరావు కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నది. కేసీఆర్ సర్కార్‌లో గౌరవంగా బతికిన వారంతా.. ప్రస్తుతం ఉపాధి పనులకు వెళ్లాల్సిన దుస్థితి వచ్చింది. 2014లో ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత కేసీఆర్ సర్కార్ కుమ్రం భీం కుటుంబానికి తగిన ప్రాధాన్యం కల్పించింది. భీం

ఉపాధి పనులు చేస్తున్న సోనేరావు దంపతులు

చరిత్రను ప్రపంచానికి చాటింది. ఆయన కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకొని అండగా నిలిచింది. భీం మనుమడు సోనేరావుకు ఐదెకరాల పట్టా భూమి ఇవ్వడంతోపాటు ఆయన కుమారుడు మాధవరావుకు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం కల్పించింది. సోనేరావు ఇద్దరు కూతుళ్లకు కూడా ప్రభుత్వ ఉద్యోగాలిచ్చింది. సోనేరావు కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు) మండలం పెద్ద దోభ గ్రామంలో నివాసముంటుండగా, పక్కా ఇల్లు కూడా నిర్మించి ఇచ్చింది. పోరుగడ్డ జోడేఘాట్‌లో రూ. 25 కోట్లతో మ్యూజియం, స్మారక చిహ్నం ఏర్పాటు చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దింది. రూ. 15.70 కోట్లతో జోడేఘాట్ వరకు డబుల్ రోడ్డు నిర్మించింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఏడాదిన్నరగా భీం కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. భీం మనుమడు సోనేరావు.. ఆయన భార్య గౌరుబాయి నిత్యం ఉపాధి పనులకు వెళ్తున్నారు. కాంగ్రెస్ సర్కారు తమను ఆర్థికంగా ఆదుకోవాలని సోనేరావు దంపతులు వేడుకుంటున్నారు.

లోకం పోకడ

మన పార్టీలో ఈయన ఉన్నట్టు!

కరగని కాంగ్రెస్ గుండెలు.. కన్నెత్తి చూడని నేతలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): ములుగులో ఓ పసిబిడ్డ ప్రాణాలు కోల్పోయినా ఓదార్పుకోసం ఎదురుచూస్తున్న బాధితులను పట్టించుకోకుండా, వాహనాలు ఆపకుండా మంత్రులు వెళ్లిపోవడం విడ్డూరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తప్పుబట్టారు. ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. 'కేసీఆర్ హయాంలో రూపుదిద్దుకున్న ఆరోగ్య తెలంగాణ.. కాంగ్రెస్ పాలనలో ఆగమవుతున్నది. ప్రభుత్వ దవాఖానల్లో జరుగుతున్న నిర్లక్ష్య ఘటనలే సాక్ష్యం. అమరచింత ఘటన మరువకముందే ములుగులో మరోఘటన చోటుచేసుకోవడం బాధాకరం' అని ఆవేదన వ్యక్తంచేశారు. గురుకులాల్లో 50 మంది విద్యార్థులు మరణించినా ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. సర్కారు భూదాహానికి నోరులేని మూగజీవులు ప్రాణాలు కోల్పోతే ఏఐ దృశ్యాలంటూ ఎగతాళి చేసిన ముఖ్యమంత్రి, మంత్రులు... పసిబిడ్డ ప్రాణాలు కోల్పోతే కన్నెత్తి చూస్తారనుకోవడం అత్యాశే అవుతుందని విమర్శించారు. అమానవీయ ఘటనలకు కాంగ్రెస్ నాయకుల గుండెలు కరగవని, వారు బాధితులవైపు కన్నెత్తిచూడరని మండిపడ్డారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి : టీయూసీఐ

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తేవాలని ప్రయత్నిస్తున్నదని, వెంటనే వాటిని రద్దు చేయాలని ట్రేడ్ యూనియన్ ఆఫ్ ఇండియా డిమాండ్ చేసింది. శనివారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కమిటీ సమావేశం విద్యానగర్‌లో జరిగింది.

మూసీ ముసుగు.. అవినీతి మురుగు

- గ్యారెంటీలకు నిధుల్లేవంటూనే మూసీకి 1.50 లక్షల కోట్లు పెడుతామని గప్పాలు
- హైడ్రా పేరిట రేవంత్ సర్కార్ అరాచకం
- హెచ్‌సీయూ భూముల్లో అక్రమాలు
- అయినా పట్టించుకోని మోదీ సర్కారు
- మోదీతో మైత్రితోనే 'హెరాల్డ్'పై ముఖ్యమంత్రి రేవంత్ మౌనం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తేతెలంగాణ) : ఓ వైపు ఆరు గ్యారెంటీల అమలుకు నిధుల్లేవని చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, మరోవైపు మూసీ సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్లు ఖర్చుపెడతామని గప్పాలు కొడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. మూసీ ముసుగులో రేవంత్ సర్కారు అవినీతి మురుగు పారిస్తున్నదని నిప్పులు చెరిగారు. మూసీ పునరుద్ధరణతో మురిసే రైతులెందరూ? సుందరీకరణతో వచ్చే ఉద్యోగాలెన్ని? అని అడిగితే సర్కారు సమాధానం చెప్పడంలేదని విరుచుకుపడ్డారు. 'బీఆర్ఎస్ హయాంలోనే మూసీ పునర్నిర్మాణానికి అంకురార్పణ చేసినం. అనేక ఎస్టీపీలు నిర్మించినం. గోదావరి నీళ్లను గండిపేటకు మళ్లించి అక్కడి నుంచి మూసీకి తరలిస్తే సరిపోతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రూ. 1.50 లక్షల కోట్లను మూసీలో పోసి ప్రజలను మోసం చేస్తున్నదని నిప్పులు చెరిగారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ నిలువనీడను కోల్పోయిన మూసీ బాధితులు ఆక్రోశంతో బూతులు తిడుతుంటే సర్కారు అక్రమ కేసులతో బెదిరిస్తున్నదని ఆరోపించారు. హెచ్‌సీయూ విద్యార్థులు వీరోచిత పోరాటంతో రేవంత్ కబ్జా పర్వానికి చెక్‌పెట్టారని అభినందించారు. విద్యార్థి ఉద్యమానికి బీఆర్ఎస్ మద్దతిచ్చింది, న్యాయపరంగా సహాయం చేసింది.. అంతేగానీ వారిని ఎక్కడా రెచ్చగొట్టలేదని స్పష్టంచేశారు.

రేవంత్ కాబట్టే దులుపుకొని పోతున్నడు

'అమ్మతోడు చెప్తున్న ఇయ్యాల జనం తిట్టే తిట్లకు రేవంత్ గాబట్టి దులుపుకొని పోతున్నడు.. ఎందుకంటే ఆయన మూడు అరాచకాలు సృష్టించిండు. మొన్న హైడ్రా, నిన్న మూసీ, ఇయ్యాల హెచ్‌సీయూ.. అక్కడ జింకలు లేవు గుంట నక్కలున్నయని బుకాయిస్తున్నడు. మరి అక్కడ నాలుగు జింకలు సచ్చిపోయినయ్..రేవంత్ ఏమంటడు? ఒక్క జింకను చంపితేనే సల్మాన్‌ఖాన్‌ను జైల్లో పెట్టిన్రు. నాలుగు జింకల మరణానికి బాధ్యుడైన సీఎంను ఏం జెయ్యాలె? రేవంత్‌లాంటోళ్లు జేయబట్టి కాంగ్రెస్ నాయకులను ప్రజలు నమ్ముతలేరు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోరని తిడుతున్నరు' అని కేటీఆర్ ఎద్దేవాచేశారు.

కేంద్రంలో సహాయ.. నిస్సహాయ మంత్రులు

రాష్ట్రం నుంచి కేంద్రంలో ఒక సహాయ మంత్రి.. మరో నిస్సహాయ మంత్రి ఉన్నారని, వారితో ఊదు

> "హైడ్రా పేరిట రేవంత్ సర్కారు హైదరాబాద్‌లో అరాచక పర్వానికి తెరలేపింది. కోర్టు సెలవులు చూసుకొని పెద్దోళ్లు, రేవంత్ సోదరుడిని వదలి పేదోళ్ల ఇండ్లను కూల్చింది. న్యాయస్థానం మొట్టికాయలేసినా పట్టించుకోకుండా గరిబోళ్ల పొట్టగొట్టింది. హైడ్రా దెబ్బ.. సర్కారు చేతగానితనంతో రియల్ ఎస్టేట్ కుప్పకూలింది. కాంగ్రెస్ 16 నెలల పాలన అన్ని రంగాలను దెబ్బతీసింది. -కేటీఆర్

> "కేంద్ర ప్రభుత్వంలో రాష్ట్రం నుంచి ఒక సహాయ మంత్రి.. మరో నిస్సహాయ మంత్రి ఉన్నరు.. వారితో ఊదు కాలదు..పీరులేవదు. ప్రజాసమస్యలపై ప్రకటనలకే పరిమితమవుతూ తెల్లారి లేస్తే కేసీఆర్‌ను తిడుతూ రేవంత్‌కు వంతపాడుతున్నరు. 'నిజంగా వారు పోరాటం చేయాలనుకుంటే రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పై చెయ్యాలె. లగచర్ల, హైడ్రా, హెచ్‌సీయూ అంశాలపై మీడియా ఎదుట ప్రభుత్వాన్ని ఎండగడుతున్నట్టు పోజులు కొట్టి చీకట్లో చేతులు కలిపారు. -కేటీఆర్

కాలదు.. పీరులేవదు అని కేటీఆర్ దెప్పిపొడిచారు. వీరు తెల్లారితే కేసీఆర్‌ను తిడుతూ సీఎం రేవంత్‌కు వంతపాడుతున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ నుంచి ఎనిమిది మంది చొప్పున ఎమ్మెల్యేలు, ఎంపీలను గెలిపిస్తే నయాపైసా తేలేదని మండిపడ్డారు.

కాంగ్రెస్, బీజేపీ దొందూదొందే

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేంద్రంలోని బీజేపీ నేతలు గల్లీలో కొట్లాడుతూ ఢిల్లీలో దోస్తీ చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. 'మంత్రి పొంగులేటి ఇంటిపై ఈడీ దాడులు జరిగి 200 రోజులు దాటినా ఇంతవరకు ఏం దొరికిందో చెప్పడం లేదు..కేసు పెట్టడం లేదు. అంటే రెండు పార్టీలు దొందూదొందే అనే విషయం ప్రజలకు అర్థమైంది' అని నిప్పులు చెరిగారు.

బలమైన బంధంతోనే రేవంత్ మౌనం..

'నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్‌గాంధీపై ఈడీ చార్జిషీట్ దాఖలైతే దేశంలోని కాంగ్రెస్ నేతలంతా ధర్నాలకు దిగుతూ బీజేపీని ఎండగడుతున్నరు. రాష్ట్రంలో కూడా పీసీసీ అధ్యక్షుడి ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి ఒక్క మాటా మాట్లాడలేదు. వాళ్ల అగ్రనేతల మీద కేసులు పెట్టినా చడీ చప్పుడు లేదు. మోదీ, రేవంత్ దృఢమైన బంధమే ఇందుకు కారణం. ఆయనను ఈయన కాపడుతరు..ఈయనను ఆయన కాపాడుతరు' అని కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

ఒక్కటి కాకుంటే విచారణకు వెనుకడుగెందుకు?

'ప్రధానమంత్రికి ఏడాదికోసారి తెలంగాణ యాది కొస్తది. నిరుడు ఏప్రిల్ 15న రాష్ట్రంలో ఆర్‌ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని మోదీ ఆరోపించారు. దానిపై ఎలాంటి కేసు లేదు. ఆర్‌ఆర్ ట్యాక్స్ ఏమైందని ఆరా తీసింది లేదు. విచారణ లేదు. మళ్లీ ఏడాది తర్వాత మొన్న రేవంత్ ప్రభుత్వం హెచ్‌సీయూ భూముల్లోకి బుల్డోజర్లు పంపుతూ అరాచకం సృష్టిస్తున్నదని చెప్పారు. సుప్రీంకోర్టు నియమించిన కేంద్ర సాధికార కమిటీ కూడా భూముల అమ్మకం పేరిట ఆర్థిక అక్రమాలు జరిగాయని తేల్చింది. కానీ ఏడాదికోసారి ఆరోపణలు చేస్తున్న మోదీ ఎందుకు పట్టించుకోవడంలేదు? పూర్వపు అనుబంధంతోనే రేవంత్ సర్కారును కాపాడుతున్నరా? లేదంటే ఇందులో మర్మమేంది? మోదీ రేవంత్ ఒక్కటికాకుంటే వెంటనే సీబీఐనో, సీవీసీనో పంపించి విచారణకు ఆదేశించాలె' అని కేటీఆర్ సూటిగా నిలదీశారు. నిజంగా కాంగ్రెస్ అక్రమ వ్యవహారాలను అడ్డుకోవాలనే చిత్తశుద్ధి ఉంటే కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

భుజాలు తడుముకున్న చందంగా..

'సెంట్రల్ యూనివర్సిటీ భూ దందా వెనుక ఓ ఎంపీ ఉన్నడని నేను ఆరోపించిన. పేరు మాత్రం చెప్పలే. ఇగ ఒకలెనుక ఒకరు ఉరికివస్తున్నరు. గుమ్మడి కాయ దొంగెవరంటే భుజాలు తడుముకుంటున్నరు. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో తెలంగాణకు ఒరిగిందేమీలేదు. 16 నెలల్లో ఒక్క సమస్యపై పోరాడలేదు. లగచర్ల లంబాడా రైతులను జైల్లో పెడితే అడిగిందీ లేదు. వాళ్లకు తెలిసిందొక్కటే.. ప్రజలకు మతపిచ్చి లేపుడు! కానీ ప్రజలు రిస్క్ తీసుకోరు. ముమ్మాటికీ ప్రజల తరఫున పోరాడుతున్న బీఆర్ఎస్‌నే గెలిపిస్తరు' అని కేటీఆర్ స్పష్టం చేశారు.

ఆదాయం కోసం సర్కార్ అడ్డదారులు

- మద్యం ధరల పెంపునకు కసరత్తు
- టెట్రా ప్యాక్‌తో పిల్లలపై ప్రభావం
- రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలి
- బీఆర్ఎస్ మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): ఆదాయాన్ని పెంచుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అడ్డదారులు తొక్కుతున్నదని మాజీ మంత్రి వీ శ్రీనివాసగౌడ్ విమర్శించారు. అందులో భాగంగానే రాష్ట్రంలో మద్యం ధరలను పెంచేందుకు కసరత్తు మొదలుపెట్టిందని చెప్పారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. మద్యం ధరలు పెంచితే రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులై పారుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఆదాయ పెంపుకోసం కొత్తగా 604 మద్యం బ్రాండ్లకు అనుమతించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నదని దుయ్యబట్టారు. పొరుగు రాష్ట్రంలో ఇబ్బడి ముబ్బడిగా మద్యం బ్రాండ్లకు అనుమతి ఇవ్వడంతో అక్కడి ప్రజలు నాసిరకం మద్యం తాగి మరణించిన సందర్భాలు అనేకం ఉన్నాయని గుర్తుచేశారు. అలాంటి పరిస్థితిని తెలంగాణ రాష్ట్రంలో రావాలని సర్కారు కోరుకుంటుందా? అని ప్రశ్నించారు. మద్యం ధరలు 10 శాతం పెంచినా.. సామాన్యులపై పెనుభారం పడుతుందని మండిపడ్డారు. ప్రస్తుతం మద్యం విక్రయాల వల్ల రాష్ట్రానికి రూ.36,500 కోట్ల ఆదాయం సమకూరుతుందని, మద్యం ధరలు పెంచితే ఆ ఆదాయాన్ని రూ.50,000 కోట్లకు తీసుకెళ్లాలని భావిస్తున్నారా? అని నిలదీశారు. టెట్రా ప్యాక్ మద్యం విధానం అమల్లోకి వస్తే, దాని ప్రభావం పిల్లలపై పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఫ్రూటీ తాగినట్లుగా పిల్లలు టెట్రా మద్యాన్ని కూడా తాగుతారంటూ తెలిపారు. విచ్చల విడిగా మద్యం వినియోగం పెరిగే ప్రమాదం ఉన్నదన్నారు.

బీఆర్ఎస్ హయాంలో నకిలీ మద్యం కట్టడి

బీఆర్ఎస్ హయాంలో నకిలీ మద్యాన్ని కట్టడి చేశామని చెప్పారు. ఆనాడే టెట్రా ప్యాక్ మద్యం ప్రతిపాదనలు వస్తే.. వాటిని ఆనాటి సీఎం కేసీఆర్ నిర్ద్వందంగా తోసిపుచ్చారని గుర్తుచేశారు. బార్‌షాపుల సంఖ్యను విపరీతంగా పెంచుతున్నారని దుయ్యబట్టారు. మిగతా రంగాల్లో ఆదాయం తగ్గుతున్నా పట్టించుకోని ప్రభుత్వం, మద్యం ద్వారానే ఆదాయం పెంచుకోవాలన్న దురాలోచన ఎందుకు చేస్తున్నదని ప్రశ్నించారు. అడ్డమైన కంపెనీ బ్రాండ్లతో ఏదైనా జరిగితే అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

ఉపాధి నిధుల్లో గోల్‌మాల్

- రూ.24.55 కోట్లు దుర్వినియోగం
- మెదక్‌లో 2.34 కోట్లు, వికారాబాద్ జిల్లాలో రూ.2 కోట్లు పక్కదారి
- మొత్తంలో రికవరీ రూ.6.22 లక్షలే
- 2024-25 ఆర్థిక సంవత్సరం యాక్షన్ టేకెన్ రిపోర్టులో వెల్లడి
- ఉపాధి హామీ పథకం అమలులో అక్రమాలపై 3.12 లక్షల ఫిర్యాదులు
- పరిష్కారమైనవి 5,837 మాత్రమే

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) నిధులు పక్కదారి పట్టాయి. సోషల్ ఆడిట్ నివేదికలో ఈ విషయం తాజాగా వెల్లడైంది. రికవరీ కూడా అంతంత మాత్రంగానే చేసినట్టు తేలింది. తెలంగాణ రాష్ట్రంలోని 32 జిల్లాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) కింద 2024-25 సంవత్సరంలో కోట్లాది రూపాయల పనులు చేపట్టారు. దేశవ్యాప్తంగా జరిపిన తనిఖీల్లో తెలంగాణ రాష్ట్రంలో రూ.రూ.24,55,14,727 నిధులు దుర్వినియోగం అయినట్టు టేకెన్ రిపోర్ట్ (ఏటీఆర్) వెల్లడించింది. ఈ నిధుల్లో కేవలం రూ.6,22,079ను (0.25%) మాత్రమే రికవరీ చేసినట్టు తెలిపింది. నిధుల దుర్వినియోగం విషయంలో 5,985 మందికి హెచ్చరిక నోటీసులు జారీచేయగా, 49 మంది ఉద్యోగులకు జరిమానాలు విధించినట్టు ఏటీఆర్ వెల్లడించింది. పథకంలో అవకతవకలు, అక్రమాలపై 3.12 లక్షల ఫిర్యాదులు రాగా, 5,837 ఫిర్యాదులు మాత్రమే పరిష్కారానికి నోచుకున్నాయి. అత్యధికంగా మెదక్ జిల్లాలో రూ.2.34 కోట్లు, వికారాబాద్ జిల్లాలో రూ.2.09 కోట్లు, ఆదిలాబాద్ జిల్లాలో రూ.1.51 కోట్లు, కామారెడ్డి జిల్లాలో రూ.1.46 కోట్ల నిధులు పక్కదారి పట్టినట్టుగా ఏటీఆర్ వివరించింది. ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు ఇంకా రూ.1.50 కోట్ల నిధులు చెల్లించాల్సి ఉన్నట్టు తెలిపింది.

నిబంధనల ఉల్లంఘన

2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై ప్రజల నుంచి 18,207 ఫిర్యాదులు అందగా, 200 ఫిర్యాదులను పరిష్కరించినట్టు డీటీఆర్‌లో వెల్లడించారు. పనిచేసే సమయంలో నిబంధనల ఉల్లంఘన (ప్రాసెస్ వాయిలేషన్స్)పై 2,05,599 ఫిర్యాదులు అందాయి. చెరువుల్లో పూడికతీసే సమయంలో, తీసిన తర్వాత గోతుల ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇలాంటి వాటిని పాటించకపోవడంపై ఫిర్యాదులు అందగా, వీటిలో 4,626 ఫిర్యాదులనే అధికారులు పరిష్కరించారు. చేపట్టిన పనుల కొలతల్లో తేడాలపై 59,696 ఫిర్యాదులు అందగా, కేవలం 587 ఫిర్యాదులనే పరిష్కరించారు. నిధుల దుర్వినియోగం, ఇంకుడు గంతలు, మరుగుదొడ్ల నిర్మాణాల్లో అవకతవకలపై 29,269 ఫిర్యాదులు అందాయి. వీటిలో 424 మాత్రమే పరిష్కారమయ్యాయి. ఇలా మొత్తం నాలుగు విభాగాల్లో 3,12,771 ఫిర్యాదులు అందగా, వీటిలో 5,837 మాత్రమే పరిష్కరించినట్టు డీటీఆర్ నివేదికలో వెల్లడించారు.

ఒక్క హామీ నెరవేర్చారా?

మొదటిపేజీ తరువాయి...

చూడండి. మీరే సమాధానం చెప్పండి" అని నిలదీశారు. కార్మికవర్గాలను సంప్రదించకుండా ప్రభుత్వం రూపొందించిన గిగ్ ముసాయిదా బిల్లును వ్యతిరేకిస్తున్నట్టు తేల్చిచెప్పారు. కనీసం కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘంతో కూడా చర్చలు జరపడం వీలుకాలేదా అని ప్రశ్నించారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని, 22నాటి ధర్నాను విరమించుకోవాలని మహేశ్‌కుమార్‌గౌడ్ కోరారు. ఇందుకు అంగీకరించిన కార్మిక నాయకులు.. ధర్నాను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు చెప్పారు. వారం, పది రోజులు చూస్తామని, సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ధర్నా తప్పదని తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో తెలంగాణ క్యాబ్‌డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, టీపీపీటీయూ రాష్ట్రస్థాయి నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావడం లేదంటూ తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలు నిలదీస్తుండగా, ఇప్పుడు కాంగ్రెస్ అనుబంధ యూనియన్ నుంచి కూడా నిరసనజ్వాలలు తప్పడంలేదని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతున్నది.

ఎములాడ రాజన్నా 13.5 కోట్లు కట్టు!

మొదటిపేజీ తరువాయి...

ఆస్తి పన్ను చెల్లించేలా లెక్కలు వేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా 2014 నుంచి 2020 వరకు రూ.6 కోట్లు బకాయిలుగా చూపుతూ 2020-21లో రాజన్న ఆలయానికి మున్సిపల్ అధికారులు నోటీసులు పంపారు. అయితే, ప్రస్తుత పన్ను బకాయి మాత్రమే చెల్లిస్తామని, గత నాలుగేండ్లుగా ప్రతి ఏడాది రూ.1.9 కోట్ల ఆస్తి పన్ను చెల్లిస్తూ వచ్చారు.

అసలు రూ.6 కోట్లు.. వడ్డీ రూ.7.5 కోట్లు..

వేములవాడ పురపాలక సంఘ కార్యాలయం నుంచి ఆస్తిపన్ను బకాయిలు రూ.13.50 కోట్లు చెల్లించాలని ఇటీవల రాజన్న ఆలయానికి నోటీసులు జారీ చేశారు. అయితే, 2014 నుంచి 2020 వరకు ఆరేండ్ల బకాయిని రూ.6 కోట్లుగా చూపుతూ దానికి వడ్డీగా రూ.7.50 కోట్లు కలిపి మొత్తం రూ.13.50 కోట్లు చెల్లించాలని నోటీసులో పేర్కొన్నది. 2020-21లో ఆలయ ఆస్తులను లెక్కించి పన్ను వేసిన మున్సిపల్ అధికారులు 2014 నుంచి బాకీ చూపడాన్ని ఆలయ అధికారులు తప్పుపడుతున్నారు. నాలుగేండ్లపాటు అధికారులు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఏకమొత్తంలో బకాయి చెల్లించాలని అధికారిక ఉత్తర్వులు జారీ చేయరాదని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నాయని పేర్కొంటున్నారు. అసలు కంటే వడ్డీ ఎక్కువగా ఉండడాన్ని తమ శాఖ ఎలా పరిగణలోకి తీసుకుంటుందని, పైగా సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం చెల్లించరాదనే వాదన వినిపిస్తున్నారు.

బాకీదారులందరికీ నోటీసులిచ్చాం

అస్తిపన్ను బకాయిలు వసూలు చేసే క్రమంలో బాకీదారులందరికీ నోటీసులు ఇచ్చాం. ఇందులో భాగంగానే రాజన్న ఆలయ అధికారులకూ ఇచ్చాం. రూ.13.5 కోట్ల బకాయి ఉన్నది. ఏడాది కరెంట్ పన్ను బకాయి మాత్రమే చెల్లిస్తున్నారు. పాత బకాయి వడ్డీతో సహా రూ.13.5 కోట్లకు చేరినందున మొత్తం చెల్లించాలని నోటీసులిచ్చాం.

- అన్వేశ్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

దేవాదాయ కమిషనర్‌కు లేఖ రాశాం

వేములవాడ రాజన్న ఆలయానికి సంబంధించిన ఆస్తిపన్ను బకాయిలపై రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ అనుమతి కోసం ఇటీవల లేఖ రాశాం. రూ.13.5 కోట్ల బకాయి చెల్లించే అంశం కమిషనర్ పరిధిలోనే ఉంటుంది. ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి తదుపరి నిర్ణయం తీసుకుంటాం.

- వినోద్‌రెడ్డి, ఈవో, రాజన్న ఆలయం

ఆర్టీసీలో యూపీఐ సేవలు

- హైదరాబాద్ సిటీ బస్సుల్లో అందుబాటులోకి తెచ్చినట్టు ఎక్స్‌లో తెలిపిన టీజీఎస్‌ఆర్టీసీ

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లోని ఆర్టీసీ బస్సుల్లో ఇక నుంచి క్యాష్‌లెస్ ప్రయాణం చేయవచ్చని, యూపీఐ సేవల ద్వారా టికెట్ పొంది ప్రయాణించవచ్చని టీజీఎస్‌ఆర్టీసీ తెలిపింది. అన్ని సిటీ బస్సుల్లో ఈ వెసులుబాటు కల్పించినట్టు ఆర్టీసీ ఎక్స్‌లో పేర్కొన్నది. ప్రయాణికులకు అవసరమైన సేవలు అందించడంలో ఆర్టీసీ ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పింది. ఈ సందర్భంగా యూపీఐ ద్వారా టికెట్ పొందిన పలువురు ప్రయాణికుల అభిప్రాయాలను ఎక్స్‌లో పోస్టు చేసింది.

ఆటోడ్రైవర్ ఆత్మహత్యాయత్నం

మొదటిపేజీ తరువాయి...

గజ్జెల బాబు (ఫైల్)

లేక ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం రాత్రి గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు అతడిని హుటాహుటిన గాంధీ దవాఖానకు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఆటో డ్రైవర్ గజ్జల బాబుకు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆటో యూనియన్ నాయకుడు వేముల మారయ్య మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ల చావులంటే సీఎంకు ఎందుకు అంత చులకనా? అని ప్రశ్నించారు. మెరుగైన వైద్యం అందించి ఆటో డ్రైవర్ ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. గిరాకీ లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు, ఏడాదికి రూ.12వేలు ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్నదని.. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా ఇప్పటికీ అమలు చేయకుండా డ్రైవర్ల మరణాలకు కారణమవుతున్నదని దుయ్యబట్టారు. చనిపోయిన ఆటో డ్రైవర్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లను ఆదుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు, ధర్నాలు చేపడుతామని హెచ్చరించారు. బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏర్పుల బాల్‌రాజ్ మాట్లాడుతూ.. రేవంత్ సర్కార్ అనాలోచిత నిర్ణయం వల్ల గజ్జెలబాబు ఒక్కడే కాదు బాబు లాంటి ఎంతో మంది ఆటో కార్మికులు తనువులు చాలిస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే బాబు కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

100 రోజుల 'ఉపాధి' ఉత్తముచ్చటే

- రాష్ట్రంలో 100 రోజులు పనిచేసిన కుటుంబాల సంఖ్య 31.01% తగ్గుదల
- జాతీయస్థాయి కంటే 3 రెట్లు అధిక పతనం
- లిబ్‌టెక్ ఇండియా నివేదికలో వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): పేద ప్రజలకు ఏటా 100 రోజులపాటు ఉపాధి హామీ పనులు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. ఉపాధి అడిగిన 15 రోజుల్లో పని కల్పించాలని ఉపాధి హామీ చట్టంలో స్పష్టంగా ఉన్నప్పటికీ ఎక్కడా అమలుకావడం లేదని లిబ్‌టెక్ ఇండియా తాజాగా విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) అమలు తీరుతెన్నులను విశ్లేషించిన ఈ నివేదిక.. 100 రోజులపాటు పని పొందిన కుటుంబాల సంఖ్య జాతీయ స్థాయితోపాటు రాష్ట్రస్థాయిలోనూ గణనీయంగా తగ్గినట్టు స్పష్టంచేసింది. రాష్ట్రంలో పూర్తిగా 100 రోజులు పనిచేసిన కుటుంబాల సంఖ్య 1.35 లక్షల నుంచి 93 వేలకు (31.01%) తగ్గిందని, జాతీయ స్థాయిలో ఈ తగ్గుదల 9.5 శాతంగా ఉన్నదని తెలిపింది.

తగ్గిన పనిదినాలు

రాష్ట్రంలో ఉపాధి పనిదినాలు స్వల్పంగా పెరిగినప్పటికీ ఒక్కో ఇంటికి లభించిన సగటు పనిదినాలు 47.71 నుంచి 45.80 రోజులకు (4%) తగ్గాయి. ఎక్కువ మంది పనిచేసినా అందరికీ తగిన స్థాయిలో పని లభించలేదు. పని దినాల కల్పనలో జిల్లా మధ్య వ్యత్యాలు ఉన్నాయి. హైదరాబాద్ మినహా మొత్తం 32 జిల్లాలకుగాను 15 జిల్లాల్లో పనిదినాలు తగ్గాయి. మిగిలిన 17 జిల్లాల్లో మాత్రం పనిదినాలు పెరిగాయి. ములుగు జిల్లాలో 36.5%, కామారెడ్డి జిల్లాలో 24.6%, వరంగల్ జిల్లాలో 24.7% వృద్ధి నమోదవగా.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 25.3%, సంగారెడ్డి జిల్లాలో 19.2%, మహబూబాబాద్ జిల్లాలో 18.1% క్షీణత నమోదైంది.

కొత్త కుటుంబాల నమోదు శూన్యం

2024-25లో అధికారులు కొత్తగా ఒక్క కుటుంబాన్ని కూడా ఉపాధి హామీ పథకంలో నమోదు చేయలేదు. 2023-24లో నమోదైన 53 లక్షల కుటుంబాల సంఖ్య అలాగే నిలిచిపోయింది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లాంటి పథకాల నేపథ్యంలో జాబ్‌కార్డులను పరిమితంగా మంజూరు చేస్తున్నట్టు తెలుస్తున్నది. దేశవ్యాప్తంగా ఈ పథకం కింద పనిచేసిన కుటుంబాల సంఖ్య 3.5% మేరకు తగ్గింది.

ఎవరికీ దక్కని రూ.300 కూలి

ఉపాధి కూలీలకు రోజువారీగా రూ.300 చొప్పున వేతనం ఇవ్వాలని కేంద్రం నోటిఫై చేసినప్పటికీ రాష్ట్రంలో వాస్తవంగా లభించింది రూ.213 మాత్రమే. నోటిఫై చేసిన కూలి కంటే 29% తక్కువ. ఉపాధి హామీ కుటుంబాల వార్షిక ఆదాయం రూ.8,637 నుంచి రూ.9,770కి చేరుకున్నప్పటికీ పూర్తి కూలి చెల్లించి ఉంటే వారి ఆదాయం రూ.13,740కు పెరిగేది. రాష్ట్రంలో ఉపాధి హామీ పనులు చేసిన అన్ని కుటుంబాలకు కలిపి రూ.3,666.33 కోట్ల ఆదాయం వచ్చేది. కానీ, తక్కువ కూలి చెల్లించడం వల్ల అది రూ.1,059.32 కోట్లు తగ్గి రూ.2,607.01 కోట్లకే పరిమితమైంది.

రాష్ట్రంలో 21 లక్షల మంది కార్మికుల తొలగింపు

ఉపాధి హామీ పథకంలో నమోదైన కార్మికులను తొలగిస్తున్న అధికార యంత్రాంగం.. కొత్త వారిని తీసుకోవడంలో మాత్రం పూర్తిగా విఫలమైనట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2024-25లో నికరంగా 0.91 లక్షల మంది కార్మికులను తొలగించారు. దేశవ్యాప్తంగా 119 లక్షల మంది కొత్త కార్మికులు ఈ పథకంలో చేరినప్పటికీ ఈ విషయంలో తెలంగాణ వెనుకబడింది. గత మూడేండ్లలో రాష్ట్రవ్యాప్తంగా 21 లక్షల మంది కార్మికులను తొలగించారు.

'పాలమూరు'పై దృష్టి పెట్టండి

- అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్19 (నమస్తే తెలంగాణ): పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు అనుమతుల సాధనపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. మైనర్ ట్యాంకుల ద్వారా ఆదా చేసిన 45 టీఎంసీలపై సీడబ్ల్యూసీ లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. శనివారం మంత్రి ఉత్తమ్ జలసౌధలో ఇరిగేషన్‌శాఖ అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి నీటి లభ్యతను అధ్యయనం చేయాలని సూచించారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టు వరద, ముంపుపై చత్తీస్‌గఢ్ అభ్యంతరాల నేపథ్యంలో మరోసారి సిమ్యులేషన్ స్టడీస్ చేయించాలని ఆదేశించారు. శ్రీశైలం డ్యామ్ ప్లంజ్‌పూల్‌లో భారీ గొయ్యి పడి చివరికి డ్యామ్‌కే ముప్పు ఏర్పడిన నేపథ్యంలో నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల పటిష్ఠతపైనా దృష్టి సారించాలని సూచించారు. ఆ రెండు ప్రాజెక్టుల భద్రతపై ఎన్‌డీఎస్‌ఏతో ప్రాథమిక సర్వే చేయించాలని కోరారు. మంత్రి ఆదేశాలతో ఈఎన్సీ అనిల్‌కుమార్ ఎన్‌డీఎస్‌ఏకు లేఖ రాశారు. డ్యామ్‌ల పటిష్ఠతపై సర్వే చేయించాలని కోరారు. అనంతరం తాగునీటిపై కలెక్టర్లతోనూ మంత్రి ఉత్తమ్ సమీక్షించారు.